# ష్.. గప్‌చుప్

- ముగిసిన ఎన్నికల ప్రచారం
- సభలు, సమావేశాలు, ర్యాలీలు నిషేధం
- 30 వరకు జిల్లా అంతటా 144 సెక్షన్ అమలు
- నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, సభలు
- తమను గెలిపించాలని అభ్యర్థుల వినతి
- సభలో కంటతడిపెట్టిన చింతా ప్రభాకర్

సంగారెడ్డి, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి మంగళవారంతో తెరపడింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది మొదలు.. పోటీచేసే బీఆర్‌ఎస్ అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో ప్రచారం ప్రారంభించారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఎమ్మెల్యే అభ్యర్థులను ముందస్తుగా ప్రకటించడంతో అభ్యర్థులు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే నియోజకవర్గాల్లో ప్రచారం మొదలు పెట్టారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులు చింతా ప్రభాకర్(సంగారెడ్డి), చంటి క్రాంతికిరణ్(అందోలు), మహిపాల్‌రెడ్డి(పటాన్‌చెరు), మాణిక్‌రావు (జహీరాబాద్), భూపాల్‌రెడ్డి(నారాయణఖేడ్) ఈ నెల 8, 9 తేదీల్లో నామినేషన్లు వేశారు. నామినేషన్లు పూర్తయిన తర్వాత నియోజకవర్గాల్లో ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. పక్షం రోజులుగా బీఆర్‌ఎస్ అభ్యర్థులు నియోజకవర్గాల్లోని గ్రామాలు, మున్సిపాలిటీల్లో పర్యటించారు. ఎమ్మెల్యే అభ్యర్థులు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలిసి తమను గెలిపించాని కోరారు. తమ నియోజకవర్గాల్లో ర్యాలీలు, బహిరంగసభలు, రోడ్ షోలు నిర్వహించి ఓటర్లను ఆకట్టుకున్నారు. నాలుగున్నరేండ్లలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం నియోజకవర్గాల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. భిన్నమైన ప్రచారాలతో ఓటర్లను ఆకట్టుకున్నారు. ఓటర్లు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులకు మద్దతు ఇస్తామని ప్రకటించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులు అన్ని కులసంఘాలు, ఉద్యోగ సంఘాలు, యువజన సంఘాలు, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలతో సమావేశమై మద్దతు కోరారు. అభ్యర్థులకు మద్దతుగా సీఎం కేసీఆర్ సంగారెడ్డి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ప్రచారం చేశారు. ప్రజా ఆశీర్వాదసభలో పాల్గొని బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాని ప్రజలను కోరారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, మహమూద్ అలీ తదితరులు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులకు మద్దతుగా సంగారెడ్డి జిల్లాలో ప్రచారం చేశారు.

**చివరిరోజు హోరెత్తిన బీఆర్‌ఎస్ ప్రచారం**

సంగారెడ్డి జిల్లాలో మంగళవారం సాయంత్రం 5గంటలతో ఎన్నికల ప్రచారానికి తెరపడింది. ప్రచారానికి చివరిరోజు కావడంతో బీఆర్‌ఎస్ అభ్యర్థులు నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, బహిరంగసభలు నిర్వహించారు. కొన్నిచోట్ల ఇంటింటి ప్రచారం చేశారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్‌ను గెలిపించాలంటూ బీఆర్‌ఎస్ శ్రేణులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి ప్రారంభమైన ర్యాలీ పాతబస్టాండ్‌లోని గంజ్‌మైదాన్ వరకు కొనసాగింది. గంజ్‌మైదాన్‌లో నిర్వహించిన బహిరంగసభలో ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ భావోద్వేగంతో కంట తడిపెట్టారు. తన ఆరోగ్యం బాగాలేకున్నా నిరంతరం ప్రజల సేవలో ఉన్నానని, కేసీఆర్ సహకారంతో నియోజకవర్గంలో రూ.4500 కోట్లతో అభివృద్ధి చేశానని.. ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజల సంక్షేమానికి పాటుపడడంతోపాటు సంగారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డి పటాన్‌చెరు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌ఎస్ ర్యాలీతో పటాన్‌చెరులో సందడి వాతావరణం నెలకొన్నది. మహిపాల్‌రెడ్డి తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. నారాయణఖేడ్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి భూపాల్‌రెడ్డి కూతురు శ్రేయరెడ్డితో కలిసి ప్రచారం చేశారు. పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని గెలిపించాలని ఓటర్లను కోరారు. అందోలు నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ ర్యాలీలో పాల్గొని తనను గెలిపించాల్సిందిగా ఓటర్లను కోరారు. జహీరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్‌రావు రంజోల్ గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. తనను గెలిపించాలని ప్రజలను కోరారు.

**ప్రలోభాలకు తెరలేపిన ప్రతిపక్ష పార్టీలు**

ఎన్నికల ప్రచారం ముగియడంతో ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రలోభాలకు తెరలేపారు. ఓట్ల కోసం తిప్పలు పడుతున్నారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లోని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రజల మద్దతు లేకున్నప్పటికీ దొడ్డిదారిలో ఎన్నికల్లో గెలిచే ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తున్నది. ఎన్నికకు ఒక్కరోజు ఉండడంతో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు ఓటర్లకు డబ్బులు, మద్యం ఎరవేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థులు సైతం గెలుపు కోసం ఓటర్లను ప్రలోభపెడుతున్నట్లు తెలుస్తున్నది.



సంగారెడ్డిలో మాట్లాడుతున్న కలెక్టర్ శరత్, ఎస్పీ రూపేశ్

# స్వేచ్ఛగా ఎన్నికలు

- ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి
- జిల్లాలో పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు
- అభ్యర్థులు ప్రచారం చేస్తే కఠిన చర్యలు
- స్థానికేతరులు జిల్లా నుంచి వెళ్లిపోవాలి
- ఎన్నికలకు భారీ బందోబస్తు, 144 సెక్షన్ అమలు
- జిల్లాలో ఇప్పటివరకు రూ.5.40 కోట్లు సీజ్,
- ఐటీశాఖ ద్వారా రూ.19.48 కోట్లు సీజ్
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్

సంగారెడ్డి నవంబర్ 28(నమస్తే తెలంగాణ) : సంగారెడ్డి జిల్లాలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా స్వేచ్ఛగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్పీ రూపేశ్, డీఆర్‌ఎస్ నగేశ్‌తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి శరత్ విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 30న జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు, ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సంగారెడ్డి జిల్లాలోని ఐదుఅసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 13,93,711మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1609 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం 7068 మంది ఎన్నికల సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటికే ఓటరు స్లిప్పులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఫోటో ఓటరు గుర్తింపు కార్డు లేదా ఎన్నికల కమిషన్ సూచించిన 16 రకాల గుర్తింపు కార్డులను చూపించి ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ అధికారులు, సిబ్బంది నిబంధనలను అతిక్రమించి తప్పులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ గుర్తింపు కార్డు ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**భారీ బందోబస్తు.. ముమ్మరంగా తనిఖీలు**

జిల్లాలో ఎన్నికల కోసం బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేలా చూసేందుకు ఎన్నికల పరిశీలకులు, మైక్రో అబ్జర్వర్ బృందాలను నియమించినట్లు చెప్పారు. సంగారెడ్డి జిల్లాలో 389 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు వెబ్ లైవ్‌కాస్టింగ్, సీసీకెమెరాల నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 5.24 కోట్లు సీజ్ చేశామని, ఆదాయపు పన్ను శాఖ రూ.19.48 కోట్లు సీజ్ చేసినట్లు తెలిపారు. ఏడు కిలోల బంగారం, 23 కిలోల వెండితోపాటు తనిఖీల్లో 2.65లక్షల లీటర్లు మద్యం సీజ్ చేసినట్లు చెప్పారు. జిల్లాలో ఉద్యోగులు పోస్టల్‌బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 189 మంది వృద్ధులు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు.

**ఓటర్లను ప్రలోభాలకు గురిచేయొద్దు**

రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రభావితం చేయొద్దని, ప్రలోభాలకు గురి చేయవద్దన్నారు. అభ్యర్థులు ప్రచారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రచారం కోసం వచ్చిన స్థానికేతరులు వెంటనే సొంత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. జిల్లాలోని హోటళ్లు, లాడ్జీలు తనిఖీలు చేస్తున్నట్లు, ఇందుకోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 30న జిల్లాలోని ఓటర్లు తప్పకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు.

**ఎన్నికలకు పకడ్బందీగా బందోబస్తు**

ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రూపేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉన్నదని, ఎవరైన శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని 1609 పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 4500 మంది కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతోపాటు 15 స్పెషల్ టాస్క్ పోలీసు బృందాలను పని చేస్తాయన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 5100 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే కఠినచర్యలు ఉంటాయని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలు 30న ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

## 30న వేతనంతో కూడిన సెలవు

- 29, 30 తేదీల్లో అన్ని సంస్థలకు సెలవు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 28 : శాసనసభ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 30న పోలింగ్ జరగనున్న సందర్భంగా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవుగా ప్రకటించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న గురువారం అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, పరిశ్రమలకు వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించారని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈ నెల 29న కూడా సెలవుగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థలకు, ప్రభుత్వ సంస్థలకు నవంబర్ 29, 30 సెలవు రోజులని కలెక్టర్ తెలిపారు.

## పోలింగ్ బృందాల ఎంపిక ప్రక్రియ పూర్తి

- ఎన్నికల పరిశీలకుల సమక్షంలో థర్డ్ ర్యాండమైజేషన్
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 28 : జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాల ఎన్నికల బృందాల కేటాయింపు ప్రక్రియ పూర్తయినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో థర్డ్ ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా బృందాల కేటాయింపు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 30న పోలింగ్‌కు సంబంధించి, అవసరమైన పోలింగ్ అధికారులు, సిబ్బంది బృందాలను పోలింగ్ కేంద్రాలకు కేటాయించినట్లు తెలిపారు. ఐదు నియోజకవర్గాల్లో మహిళా పోలింగ్ కేంద్రాలు, పీడబ్ల్యూడీ, యూత్ మేనేజ్‌మెంట్‌తోపాటు మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు దీపక్‌సింగ్లా, పవన్‌కుమార్, నజీమ్ జైభాన్, అదనపు కలెక్టర్ మాధురి, నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి విజయ్‌కుమార్, బీసీ సంక్షేమశాఖ అధికారి జగదీశ్, ఎన్‌ఐసీ అధికారి విద్యాసాగర్ పాల్గొన్నారు.



ర్యాండమైజేషన్‌లో కలెక్టర్ శరత్, ఎన్నికల పరిశీలకులు



హత్నూరాలో బట్టలు ఇస్త్రీ చేస్తూ ఓటు అభ్యర్థిస్తున్న సునీతాలక్ష్మారెడ్డి



హత్నూరాలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి

# బీఆర్‌ఎస్‌తోనే భరోసా

- కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలు తప్పవు
- కరెంట్ ఇవ్వరు.. హామీలు అమలు కావు
- కాంగ్రెస్, బీజేపీ మాటలను నమ్మొద్దు
- సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి, సంక్షేమం
- బీఆర్‌ఎస్ నర్సాపూర్ అభ్యర్థి సునీతారెడ్డి

హత్నూర, నవంబర్ 28 : వ్యవసాయానికి 3 గంటల కరెంటు సరిపోతుందని.. 10హెచ్‌పీ మోటర్లతో నీళ్లు తోడేయవచ్చు అని రైతులకు సమస్యలు సృష్టించాలని చూస్తున్న కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలు తప్పవని నర్సాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ప్రచారంలో భాగంగా మంగళవారం హత్నూర మండలం బోర్పట్ల, రెడ్డిఖానాపూర్, కాసాల, ముచ్చర్ల, తూప్రాన్‌పేట, నస్తీపూర్, హత్నూర గ్రామాల్లో లేబర్ వెల్ఫేర్‌బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలప్పుడు ప్రజలకు కనిపించే కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాయమాటలు చెప్పి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని, అలాంటి పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండి అభివృద్ధి సాధిస్తున్న బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలని కోరారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తూ దేశానికి ఆదర్శంగా రాష్ట్రాన్ని నిలిపిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ రైతుబంధు డబ్బులను అడ్డుకొని రైతులను ఇబ్బందులు కలిగేలా వ్యవహరిస్తున్నట్లు విమర్శించారు. కాంగ్రెస్ పాలకులు అభివృద్ధిని సాధించలేదని, సంక్షేమ పథకాలను పట్టించుకోలేదన్నారు. గతంలో వ్యవసాయానికి ప్రభుత్వసాయం లేక, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ప్రజలు వలసలు వెళ్లిన రోజుల నుంచి నేడు ఇతర రాష్ట్రాల ప్రజలు ఇక్కడికి వలస వస్తున్నట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ మరోమారు విజయం సాధించనుందని పేర్కొన్నారు. ప్రజలు కారుగుర్తుకు ఓటేసి గెలిపించాలని సునీతారెడ్డి అభ్యర్థించారు.

ప్రచారంలో ఎంపీపీ నర్సింహులు, జడ్పీటీసీ ఆంజనేయులు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు దేవేందర్‌రెడ్డి, దుర్గారెడ్డి, బుచ్చిరెడ్డి, మధు, కిషన్‌రావు, వెంకటేశంగుప్త, రాణీరామచంద్రారెడ్డి, వీరస్వామిగౌడ్, కిష్టయ్య, రవి, శివశంకర్‌రావు, యాదగిరి, ఎల్లయ్య, విఠల్‌రెడ్డి, అజ్జు, సాయి, అజీస్ తదితరులు పాల్గొన్నారు.